VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

# కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 133
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
బుధవారం 21 అక్టోబర్ 2026

## శ్రీ రాజరాజేశ్వరి అలంకృత అమ్మవారిని దర్శించుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్





**విజయవాడ,కలంకౌంటర్ :** ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రి పైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయానికి చేరుకున్న గవర్నర్ కు అధికారులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ అమ్మవారి అంతరాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు గవర్నర్ కు వేదాశీస్సులు అందజేశారు. ఆయనకు దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు, కమిషనర్ కె. రామచంద్రమోహన్, ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్ తదితరులు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

## పార్టీని ధిక్కరిస్తే వేటు తప్పదు.. రెబల్స్‌కు చంద్రబాబు వార్నింగ్

- స్థానిక ఎన్నికల్లో రెబల్స్‌గా పోటీ చేస్తే చర్యలు తప్పవన్న చంద్రబాబు
- తిరుగుబాటు నామినేషన్లను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశం
- కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపు



**అమరావతి,కలంకౌంటర్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఆదేశాలను ధిక్కరించి రెబల్స్‌గా పోటీ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. ఈరోజు పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తిరుగుబాటు అభ్యర్థులుగా దాఖలు చేసిన నామినేషన్లను వెంటనే ఉపసంహరించుకోవాలని, కూటమి అధికారిక అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. అభ్యర్థుల ఎంపిక, ప్రచార కార్యక్రమాలను మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సాధారణ ఎన్నికల్లో సాధించిన ఫలితాల కన్నా మెరుగైన ఫలితాలు స్థానిక ఎన్నికల్లో సాధించాలని ఆయన ఆకాంక్షించారు. పాలనలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే లక్ష్యంతో, టీడీపీ పోటీ చేస్తున్న 11 కార్పొరేషన్లను 11 వేర్వేరు సామాజిక వర్గాలకు కేటాయించినట్లు వెల్లడించారు. పార్టీ అధికారిక అభ్యర్థులకు బీ-ఫారాలు సకాలంలో అందజేయాలని, పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి బరిలో నిలిచే వారిపై వేటు తప్పదని చంద్రబాబు స్పష్టం చేశారు. "కూటమిగా మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తున్నప్పుడు స్వతంత్రంగా నామినేషన్లు వేయడం సరికాదు. కేటాయించిన స్థానాల్లో మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది" అని స్పష్టం చేశారు. పొత్తులు, సర్దుబాట్ల కారణంగా ఈ ఎన్నికల్లో టికెట్లు దక్కని పార్టీ కార్యకర్తలకు భవిష్యత్తులో నామినేటెడ్ పోస్టులు ఇచ్చి న్యాయం చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. "ఈ ఎన్నికలు పూర్తయ్యే వరకు నేను ముఖ్యమంత్రిగా కాకుండా, కేవలం పార్టీ అధ్యక్షుడిగానే వ్యవహరిస్తా. మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం పార్టీ కార్యకర్తలుగానే పనిచేయాలి. ఈ నెల రోజుల సమయం మనందరి పనితనానికి పరీక్ష. సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన 57 శాతం స్ట్రైక్ రేట్‌ను మించి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి" అని చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు.

## ఏపీ మున్సిపల్ ఎన్నికలు: 22,806 నామినేషన్లు ఆమోదం, బరిలో పార్టీల బలాబలాలు

**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 28న జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సోమవారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 22,806 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం (SEC) అధికారికంగా ప్రకటించింది. వివిధ కారణాలతో 1,531 నామినేషన్లను తిరస్కరించినట్లు అధికారులు వెల్లడించారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలోని మేయర్లు/ఛైర్‌పర్సన్లు, వార్డు సభ్యుల పదవులకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. వివరాల్లోకి వెళితే, రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్ పదవుల కోసం మొత్తం 286 నామినేషన్లు ఆమోదం పొందాయి. వీటిలో అధికార ఎన్డీయే కూటమిలోని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) 46, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ 8, బీజేపీ 4 నామినేషన్లు దాఖలు చేశాయి. ఇక వైసీపీ తరఫున 47 మంది, వైఎస్ షర్మిల నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ నుంచి 35 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మరో 93 మంది స్వతంత్రులు కూడా మేయర్ పదవికి పోటీ పడుతున్నారు.

# అడుగడుగునా నీరాజనం!

## కూటమి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా ఎన్నికల ప్రచారం









**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నగరంలో కూటమి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా ఎన్నికల ప్రచారం సందర్భంగా పర్యటిస్తున్న ప్రాంతాల్లో ఆమెకు ప్రజలు నీరాజనం పడుతున్నారు.స్థానికులతో ముఖాముఖి సమావేశాలు, ప్రజలతో మమేకమవుతూ సాగుతున్న ప్రచార కార్యక్రమాలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రచారంలో భాగంగా అబ్దుల్ అబీదా స్థానికులను కలిసి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

**ప్రజలతో మమేకం....** ప్రజలతో నేరుగా మాట్లాడటం, వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రచార కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొంటూ తమ అభ్యర్థి తరఫున ప్రజలను కలుస్తున్నారు. అడుగడుగునా ప్రజల పలకరింపులు.. ప్రచారంలో అబ్దుల్ అబీదా ముందడుగు!

### మీ బిడ్డగా ఆశీర్వదించండి! ప్రజల ఆశీస్సులే నా బలం

"మీ ఇంటి ఆడబిడ్డగా భావించి ఆశీర్వదించండి.. మీ ఆదరణతో ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించండి" నగర ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటాను. సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తాను. ప్రజలకు సువరిపాలన అందిస్తా. మన మచిలీపట్నం... మన భవిష్యత్తు కోసం ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నడుచుకుంటా.ప్రజల ఆకాంక్షలు గౌరవిస్తా....అంటూ ప్రచారంలో భరోసా ఇస్తున్నారు.









# పుల్లారెడ్డి నగర్‌లో వైభవంగా దేవీ శరన్నవరాత్రులు





**కావలి,కలంకౌంటర్ :** పట్టణంలో పుల్లారెడ్డి నగర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో యూత్ కమిటీ నిర్వాహకులు కే. వరప్రసాద్, ఎన్. రోహిత్, రవి, మనోజ్, వర్షిత్, జస్వంత్, ఋషి, శ్రీకాంత్, బద్రి, కాశీ కుమార్, ఆర్. హర్ష, సుమన్, చంద్ర, నితిన్, భారతి, సరళ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశంలోకి 25 కుటుంబాలు

## ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో చేరికలు

### రోజురోజుకు టీడీపీ కి పెరుగుతున్న మద్దతు





**కందుకూరు,కలంకౌంటర్ :** స్థానిక సంస్థల ఎన్నికల వేళ తెలుగుదేశం పార్టీకి ప్రజామద్దతు రోజురోజుకు పెరుగుతుంది. అనేక వర్గాల ప్రజలు వైసీపీకి రాజీనామా చేసి టిడిపిలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. వారంతా స్వచ్ఛందంగా పార్టీలో చేరేందుకు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెంతకు క్యూ కడుతున్నారు. లింగసముద్రం మండలం మొగిలిచర్ల, ఆర్ఆర్ పాలెం గ్రామాలకు చెందిన 25 కుటుంబాల వారు .... ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నాగేశ్వరరావు వారందరినీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.మొగిలిచర్ల గ్రామంలో, వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్న.... వెన్నపూస శ్రీనురెడ్డి, చిన్నసుబ్బయ్య రెడ్డి, యానాదిరెడ్డి, చిన్నరాఘవరెడ్డి, మలిరెడ్డి శేఖర్ రెడ్డి, రాఘవరెడ్డి, రమణయ్యరెడ్డి, యనదాసరి మాతయ్య, సామ్యేలు, నెమ్మికంటి కొండయ్య, పిచ్చపాటి మాల్యాద్రిరెడ్డి, కృష్ణారెడ్డి, కేతినేని నాగేశ్వరరావు కుటుంబాల వారు టిడిపిలో చేరారు. ఆర్ ఆర్ పాలెం గ్రామానికి చెందిన.... వంకదారి మాల్యాద్రి, చొప్పర మల్లికార్జున, వెంకటేశ్వర్లు, కేతినేని కనకాద్రి, శరత్ బాబు, నరేంద్ర, సింగమనేని గోపాల్, షేక్ రహంతుల్లా, రహమత్ బాషా, వల్లేరు నాగరాజు, బొగ్గవరపు రవి, కండే మాధవ, యడవల్లి మాలకొండయ్య కుటుంబాల వారు వైసీపీని వీడి టిడిపిలో చేరారు. కందుకూరులోని టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో... మొగిలిచర్ల నాయకులు పాల్గొన్నారు.

# నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన మంగళగిరి వైసీపీ నేతలు



**మంగళగిరి,కలంకౌంటర్ :** మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తమ కుటుంబాలతో సహా తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న దామర్ల కుబేరస్వామి, ఆయన కుటుంబ సభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ వీరికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మంగళగిరి పట్టణానికి చెందిన సీనియర్ నేత తోలేటి రవీంద్ర, దుగ్గిరాల మండలానికి చెందిన షేక్ అబ్దుల్ సలాం, బిట్రా శేషాంజనేయులు, బిట్రా శ్రీనివాసరావు వంటి ముఖ్య నాయకులు ఉన్నారు. వీరందరితో పాటు మొత్తం 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. స్వయంగా మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో వైసీపీకి చెందిన కీలక నేతలు పార్టీ వీడటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఇస్తామని లోకేశ్ వారికి హామీ ఇచ్చారు. అందరం కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని ఈ సందర్భంగా పిలుపు ఇచ్చారు.

# 'స్టోరీస్ ఎరీనా స్పోర్ట్స్ కాంప్లెక్స్'ను ప్రారంభించిన స్పీకర్





**నర్సీపట్నం,కలంకౌంటర్ :** నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సుబ్బారాయుడుపాలెం సమీపాన గల హనుమాన్ కాఫీ కేఫ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'స్టోరీస్ ఎరీనా స్పోర్ట్స్ కాంప్లెక్స్'ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రికెట్ ఆటను యువ నాయకులు టిడిపి పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ స్వయంగా బ్యాటింగ్ చేసి ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. నేటి యువత క్రీడల పట్ల మరింత ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజూ ఇటువంటి క్రీడలు ఆడటం వల్ల శరీరానికి తగిన వ్యాయామం లభించడమే కాకుండా, మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి ఇలాంటి క్రీడా ప్రాంగణాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ క్రీడలను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి అల్లు రామునాయుడు, ముఖ్య నాయకులు రుత్తల యర్రాపాత్రుడు, సబ్బవరపు వెంకటరమణ, చిరంజీవి రాజు, రెడ్డి రామరాజులతో పాటు పలువురు క్రీడాకారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఉత్సవ మూర్తుల ఊరేగింపులో పాల్గొన్న నగర పోలీస్ కమీషనర్ ఎస్. వి. రాజ శేఖర బాబు

● అధునాతన టెక్నాలజీ, పటిష్టమైన బందోబస్తుతో ప్రశాంతంగా ముగిసిన దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు.





**విజయవాడ, కలంకౌంటర్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిస్తూ, దర్శనాలు సులభతరం చేయడమే లక్ష్యంగా విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్. వి. రాజశేఖర బాబు ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు నిర్వహించబడ్డాయి. అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేశారు. అత్యంత కీలకమైన 'మూలా నక్షత్రం' రోజుతో పాటు ఉత్సవాల చివరి రోజైన విజయదశమి నాడు ఎక్కడా తొక్కిసలాట గానీ, అవాంఛనీయ సంఘటనలు గానీ జరగకుండా ప్రశాంత వాతావరణంలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు.మోడల్ గెస్ట్ హౌస్‌లోని సిసిటివి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నగరంలోని ప్రధాన ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించారు. రద్దీ ఎక్కువగా ఉన్న సీతమ్మవారి పాదాలు ఘాట్,



వినాయకుడి గుడి పరిసర ప్రాంతాలలో సీపీ స్వయంగా పర్యటించి, విధుల్లో ఉన్న అధికారులకు మరియు సిబ్బందికి అప్పటికప్పుడు తగిన ఆదేశాలు, సూచనలు అందించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను చివరి రోజు అయిన విజయదశమి రోజు సందర్భంగా సాయంత్రం కృష్ణానదీ తీరంలోని దుర్గాఘాట్ వద్ద అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల తెప్పోత్సవ కార్యక్రమానికి ముందుగా నిర్వహించిన ఉత్సవమూర్తుల ఊరేగింపులో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు ఇతర పోలీసు అధికారులతో కలసి పాల్గొన్నారు. ఈ క్రమంలో ?సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగిస్తూ ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించడమే కాకుండా, అహోరాత్రులు శ్రమించిన పోలీస్ అధికారులు, సిబ్బంది యొక్క క్షేమం మరియు సంక్షేమాన్ని ప్రత్యేకం దృష్టిలో ఉంచుకుని అన్ని సదుపాయాలు కల్పించిన నగర పోలీస్ కమిషనర్ గారికి పోలీస్ సిబ్బంది ఆనందోత్సాహాలతో హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# జాతీయ సరస్ మేళా--2026కు విశేష స్పందన

● రూ.3.71 కోట్లకు చేరిన మొత్తం విక్రయాలు -- ఒక్కరోజే 50 వేలకు పైగా సందర్శకులు





**విజయవాడ,కలంకౌంటర్ :** కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (APSRLM/SERP) సహకారంతో విజయవాడలోని పున్నమి ఘాట్‌లో అక్టోబర్ 13 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా--2026కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. 2026 అక్టోబర్ 19 నాటికి మేళాలో మొత్తం రూ.3.73 కోట్ల విలువైన సుమారు 1.51 లక్షల ఉత్పత్తుల విక్రయాలు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న స్వయం సహాయక సంఘాల (ఢాఎ+) మహిళలు తయారు చేసి విక్రయిస్తున్న ఉత్పత్తులకు లభిస్తున్న ఆదరణకు ఈ గణాంకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌లో పెరుగుతున్న గుర్తింపును ఇవి ప్రతిబింబిస్తున్నాయి.

**అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.86.59 లక్షల విక్రయాలు..** అక్టోబర్ 19, 2026న జాతీయ సారస్ మేళాలో రూ.88.89 లక్షల విలువైన 32,080 ఉత్పత్తులు విక్రయించబడ్డాయి. పున్నమి ఘాట్‌లో వం-ర్షం కురిసినప్పటికీ, మేళాను 50 వేలకు పైగా సందర్శకులు సందర్శించారు. ప్రతికూల వాతావరణం కారణంగా విక్రయాలపై కొంత ప్రభావం పడినప్పటికీ, భారీ సంఖ్యలో సందర్శకులు తరలిరావడం గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల పట్ల ప్రజల్లో ఉన్న ఆసక్తిని, ఆదరణను స్పష్టం చేస్తోంది. అదే రోజు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సతీమణి మేళాను సందర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె పర్యటన మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు, మహిళల నాయకత్వంలో నడుస్తున్న వ్యాపారాలకు, గ్రామీణ జీవనోపాధుల బలోపేతానికి ఉన్న ప్రాముఖ్యతను మరింతగా చాటిచెప్పింది. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా. పి. కృష్ణయ్య (రిటైర్డ్ IAS) జాతీయ సరస్ మేళా--2026లోని వివిధ స్టాళ్లను సందర్శించి, స్వయం సహాయక సంఘాల (ఢాఎ+) మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల పారిశ్రామిక నైపుణ్యాలు, సృజనాత్మకత, వ్యాపారాభివృద్ధి పట్ల వారి నిబద్ధతను అభినందించారు. మహిళలు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకోవాలని, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ప్రోత్సహించారు.

**మహిళా పారిశ్రామికవేత్తలకు జాతీయ స్థాయి మార్కెటింగ్ వేదిక..** జాతీయ సారస్ మేళా గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు ప్రదర్శించి, విక్రయించుకునేందుకు విలువైన జాతీయ స్థాయి వేదికను అందిస్తోంది. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ మేళాలో పాల్గొని చేనేత వస్త్రాలు, సంప్రదాయ హస్తకళలు, సహజ మరియు ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులు, గృహోపకరణాలు, ప్రాంతీయ ప్రత్యేక ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. ఉత్పత్తిదారులు, కళాకారులు, వినియోగదారులు, ఇతర భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా మహిళా సంఘాలు తమ మార్కెట్ పరిధిని



విస్తరించుకోవడానికి, వినియోగదారుల అభిరుచులను తెలుసుకోవడానికి, కొత్త వ్యాపార సంబంధాలను ఏర్పరచుకోవడానికి, వ్యాపార అభివృద్ధికి అవసరమైన అవకాశాలను అన్వేషించడానికి ఈ మేళా దోహదపడుతోంది.

**గ్రామీణ జీవనోపాధుల బలోపేతం -- మహిళా ఆర్థిక సాధికారత..** ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ నమోదవుతున్న విక్రయాలు, సందర్శకుల సంఖ్య గ్రామీణ మహిళల వ్యాపార నైపుణ్యాన్ని ప్రోత్సహించడంలో వ్యవస్థీకృత మార్కెటింగ్ వేదికల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాయి. మహిళలు తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో మార్కెట్ చేసుకునే అవకాశాలను కల్పించడం ద్వారా వారి ఆదాయ కార్యకలాపాలను బలోపేతం చేయడంతో పాటు, సంప్రదాయ నైపుణ్యాలు, హస్తకళలు, చేతివృత్తుల పరిరక్షణకు, స్థిరమైన గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి ఈ మేళా తోడ్పడుతోంది.

# ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు, సుఖసంతోషాలు కలగాలి - జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్

● ఘనంగా ఆయుధాలు, వాహనాలకు ఆయుధ పూజ నిర్వహించిన జిల్లా ఎస్పీ






**ఒంగోలు,కలంకౌంటర్ :** ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అహర్నిశలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు ఆయుధాలు, వాహనాలకు ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సతీసమేతంగా పాల్గొన్నారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణకు ప్రతీకగా భావించే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిత్యం ఉపయోగించే ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, విధి నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా ఉండాలని, దుర్గామాత ఆశీస్సులు అందరికీ కలగాలని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, విజయదశమి పోలీసు శాఖకు ప్రత్యేకమైన పండుగ అని, ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పోలీసులకు ఆయుధాలతో ప్రత్యేక అనుబంధం ఉంటుందని, పోలీసు వ్యవస్థలో ప్రతి ఒక్కరూ ఆయుధాలను గౌరవిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ గారు గుర్తుచేశారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసే వాహనాలకు కూడా అంతే ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, జిల్లా పోలీసు శాఖ అన్ని రంగాల్లో విజయవంతంగా ముందుకు సాగాలన్నారు. ప్రకాశం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలందరికీ జిల్లా ఎస్పీ గారు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన ప్రతి కార్యం సఫలీకృతం కావాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్)వెంకటేశ్వర్లు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు వెంకటేశ్వరరావు, వీర నాయక్,విజయకృష్ణ, శేషగిరి రావు, ప్రసాద్, విజయచంద్ర, ఆర్ఐలు రమణా రెడ్డి, సీతారామరెడ్డి, హాజరత్తయ్య, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై భక్తజన సందోహం!

● భవానీల రాకతో పెరిగిన రద్దీ ● ప్రభుత్వ ఏర్పాట్లపై భక్తుల సంతృప్తి






**ఇంద్రకీలాద్రి,కలంకౌంటర్ :** ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాల చివరి రోజైన మంగళవారం భక్తుల రద్దీ భారీగా పెరిగింది. సాధారణ భక్తులతో పాటు భవానీమాలధారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కొండపై సందడి నెలకొంది. జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు ప్రభుత్వం, దేవస్థానం, జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తాగునీరు, క్యూలైన్ల నిర్వహణ, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించడం ద్వారా భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ సమన్వయంతో ఏర్పాట్లను నిర్వహించడం భక్తులకు ఊరటనిచ్చింది. దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, దేవస్థానం ఈవో వి.కె.శీనా నాయక్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర తదితరుల ఆధ్వర్యంలో సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు, భద్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. నవరాత్రి ఉత్సవాల ముగింపు వేళ భక్తుల రాకతో ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక సందడిని సంతరించుకుంది. ప్రభుత్వ, దేవస్థానం ఏర్పాట్లు భక్తులకు సౌకర్యవంతమైన దర్శనానికి తోడ్పడ్డాయి.

# టీడీపీలోకి గణేష్ నగర్ వైఎస్సార్ సీపీ నాయకులు

**గిద్దలూరు,కలంకౌంటర్ :** పట్టణంలోని గణేష్ నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు కోటా రఘు, సాధు సుధాకర్, కోటా భరత్ లు తమ అనుచరులతో కలిసి వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గిద్దలూరు పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి కోటా రఘు, సాధు సుధాకర్‌తో పాటు వారి అనుచరులను తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో టీడీపీకి ఆదరణ పెరుగుతోందని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులుపాల్గొన్నారు




# ఎన్నికల ప్రచారానికి వ్యూహం రచిస్తున్న బిజెపి నేతలు..






బిజెపి అభ్యర్థి నామినేషన్ లో బిజెపి పూర్వ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు...

కూటమి ధర్మాన్ని పాటించి జెవి నారాయణ విజయం కోసం కృషి చేస్తానంటున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి...

**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచున్న బిజెపి అభ్యర్థి డాక్టర్ జెవి నారాయణ ఎన్నికల ప్రచారానికి బిజెపి రాష్ట్ర నాయకులు నాగొతు రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు, బిజెపి నాయకులు వ్యూహం రచిస్తున్నారు. మార్కాపురం జిల్లా బీజేపీ అధ్యక్షులు పివి కృష్ణారావు గత రెండు రోజులుగా గిద్దలూరులో మఖం వేసి క్షేత్రస్థాయి నాయకులు కార్యకర్తలు సమీకరించి ప్రచారానికి సిద్ధం చేశారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు గత రెండు రోజులుగా గిద్దలూరులో వేసి బిజెపి కేడర్లో ఉత్సాహాన్ని నింపారు. బుధవారం నుంచి డాక్టర్ జె.వి నారాయణ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించేందుకు ఎన్నికల కార్యకర్తలు పార్టీ కార్యకర్తలు నాయకులను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం జరిగే వారం రోజులపాటు పలువురు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు ప్రచారాన్ని పదునెక్కించనున్నారు. డాక్టర్ జె వి నారాయణ బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో నారాయణ విజయం కోసం సమిష్టిగా కృషి చేయాలని బీసీ సంఘాల నేతలను కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు నాయకులను గిద్దలూరు పిలిపించి బీసీ కులాల ఓటర్లను కలిసి ఓటు వేయాలని అభ్యర్థి ఉంచేందుకు వ్యూహం రచిస్తున్నారు. ప్రణాళిక బద్ధంగా ఎన్నికల ప్రచారాన్ని పర్యవేక్షించేందుకు సుమారు పదిమందికి పైగా జిల్లా నాయకులు గిద్దలూరులో తిష్ట వేసి ప్రచారాన్ని పదునెక్కించనున్నారు. గిద్దలూరు లో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఎన్నికల ప్రచారానికి పూర్తి భద్రత కల్పించాలని రాష్ట్ర స్థాయిలో బిజెపి నాయకులు పోలీసు అధికారులకు విన్నవించినట్లు తెలిసింది.

# వైభవంగా ముగిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రులు




**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణం పొట్టి శ్రీరాములు బజారు లో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం విజయదశమి పర్వదిన సందర్భంగా దేవి శరన్నవరాత్రులు ఎంతో వైభవంగా ముగిసాయి. ఆలయ ప్రెసిడెంట్ కోట వెంకట నరసింహ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సోలా రాజస్వామి అమ్మవారిని కన్నుల పండుగగా అలంకరించి అమ్మవారి మూలమంత్ర హోమం చివరగా పూర్ణాహుతి నిర్వహించారు. పూర్ణాహుతి లో ఆలయ ప్రెసిడెంట్ తో పాటు ఉభయ దాతలు పైడిమర్రి వెంకటసుబ్బారావు ధర్మపత్ని భిక్షావతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం నవరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# టెక్నాలజీతో టెన్షన్.. స్పిరిచ్యువాలిటీతోనే శాంతి: సీఎం చంద్రబాబు

● విజయవాడ ఉత్సవం 2.0లో సీఎం చంద్రబాబు ప్రసంగం



**విజయవాడ, కలంకౌంటర్ :** సాంకేతికత (టెక్నాలజీ) మనకు పురోగతిని అందిస్తుండవచ్చు కానీ, దాంతో పాటు తీవ్రమైన ఒత్తిడిని కూడా మోసుకొస్తోందని, ఆ టెన్షన్‌ను జయించడానికి ఏకైక మార్గం ఆధ్యాత్మికతేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం ఎంత ముఖ్యమో, మన సంస్కృతీ సంప్రదాయాలను, వేల ఏళ్ల వారసత్వాన్ని కాపాడుకోవడం కూడా అంతే కీలకమని ఆయన ఉద్ఘాటించారు. విజయవాడలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహించిన “విజయవాడ ఉత్సవ్ 2.0” ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, “విజయవాడ ఉత్సవాన్ని రెండోసారి దేశం, ప్రపంచం గుర్తుంచుకునేలా నిర్వహించారు. ఇందుకు కారణమైన నిర్వాహకులను, విజయవాడ ప్రజలను పేరుపేరునా అభినందిస్తున్నాను. మీ అందరినీ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. విజయవాడ ఉత్సవం 3.0 ప్రపంచమే మనవైపు తిరిగి చూసేలా నిర్వహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. ఈ విజయానికి దుర్గమ్మ తల్లి ఆశీస్సులే కారణం” అని అన్నారు. మన కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను చాటిచెప్పేలా ఈ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సంగీతం, నృత్యం, జానపద కళలు, సాంస్కృతిక ప్రదర్శనలతో దసరా ఉత్సవాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారని కొనియాడారు. ఈ ఉత్సవాలతో పాటు 'సరస్ సదస్సు'ను కూడా ఇక్కడే నిర్వహించడం విజయవాడకు ఒక ప్రత్యేకమైన శోభను తెచ్చిపెట్టిందని ఆయన పేర్కొన్నారు.

# విజయదశమి సందర్భంగా మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు




**కందుకూరు,కలంకౌంటర్ :** విజయదశమి పర్వదిన సందర్భంగా కందుకూరు కోవూరు రోడ్డు నందు ఉన్న ఎం కె శ్రీశ్రీ రాజరాజేశ్వరి అమ్మ అనుగ్రహ సొసైటీ వ్యవస్థాపకులు,న్యూమరాలజిస్ట్, ప్రశ్న వాస్తు జ్యోతిష్కులు కొచ్చర్ల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులచే కుంకుమ పూజ, అష్టోత్తరం నిర్వహించి భక్తులకు నరగోష దిష్టి దోష నివారణ యంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామి మాట్లాడుతూ విజయదశమి పర్వదినం సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు గోశాల వద్ద అన్న ప్రసాద వినియోగం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సతి కోసం పతి ప్రచారం





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం కూటమి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా గెలుపు కోసం భర్త తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీమ్ బేగ్ అహర్నిశలు శ్రమిస్తున్నారు.

# రాష్ట్ర తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ హసీమ్ బేగ్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం 16వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి, రాష్ట్ర తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ షేక్ హసీమ్ బేగ్ పుట్టినరోజు సందర్భంగా స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకులు షేక్ రఫీ,దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని 14వ డివిజన్ ఎస్టీ కాలనీలో సుమారు 200 మంది నిరుపేదలకు ఘనంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి మచిలీపట్నం మేయర్ స్థానానికి కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని షేక్ అబ్దుల్ అబీదా, టీడీపీ మాజీ మున్సిపల్ ఛైర్మన్ మొటమర్రి బాబాప్రసాద్, 14వ డివిజన్ కూటమి అభ్యర్థి తిరుమలశెట్టి నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, హసీమ్ బేగ్ పుట్టినరోజు వేడుకలను పేదలకు అన్నదానం చేస్తూ జరుపుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకుంటూ ప్రజలకు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. మచిలీపట్నం నగరం అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం మేయర్ అభ్యర్థిని షేక్ అబ్దుల్ అబీదా మాట్లాడుతూ, మేయర్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 28న జరిగే ఎన్నికల్లో తనతో పాటు 60 డివిజన్లలో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే మచిలీపట్నం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మచిలీపట్నంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఆమె విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు నగరంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగె దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ...మచిలీపట్నం 16వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి, రాష్ట్ర తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ షేక్ హసీమ్ బేగ్ పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలతో కలిసి కేక్ కటింగ్ నిర్వహించి, అన్నదానం చెయ్యడం సంతోషంగా ఉందని తెలిపారు. ట్రస్ట్ నిర్వాహకులు షేక్ రఫీ మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, నిరుపేద కుటుంబాలకు భరోసా కల్పించడం, ముఖ్యంగా పిల్లల భవిష్యత్తుకు తోడ్పాటు అందించడం తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తూ, అవసరమైన వారికి తమ వంతు సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఎస్ టి కాలోని ప్రజలు, తదితరులు పాల్గొని పెద్ద ఎత్తున జయప్రదం చేశారు.

# పీఠాధిపతి ఆశీస్సులు





**విజయవాడ,కలంకౌంటర్ :** విజయదశమి సందర్భంగా పెనుగొండ వాసవి క్షేత్ర పీఠాధిపతులు బాలస్వామి ని కలిసి వారి శుభ ఆశీస్సులు తీసుకున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు.

# మాజీ మంత్రి శిద్దా ఆధ్వర్యంలో అన్నదానం





**ఒంగోలు, కలంకౌంటర్ :** విజయదశమి పునస్కరించుకొని ఒంగోలు లాయర్ పేట సాయి బాబా మందిరంలో భారీ అన్న సంతర్పణ ఘనంగా జరిగింది. రాష్ట్ర మాజీమంత్రి డా. శిద్దా రాఘవ రావు,శ్రీమతి శిద్దా లక్ష్మి పద్మావతి దంపతులు ఆద్వర్యంలో జరిగిన అన్న సంతర్పణ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శి ద్దా పాండురంగరావు,శిద్దా వెంకట ప్రసాద్,చీమకుర్తి కోటి లింగం,రావిపూడి లక్ష్మి నారాయణ,, షిర్డీ సాయి కల్చరల్ మిషన్ కమిటీ సభ్యులుమల్లాది వెంకట సుబ్బలక్షమ్మ,శ్రీధర్ రెడ్డి,డా.ప్రసాద రావు, గంజాం విజయ శివ కుమార్, మెడా జయరాజ్, వాసు సాయి రాజ్, సాయిబాబా,,చంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ అంకమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలి - ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** విజయదశమి పర్వదినం సందర్భంగా... కందుకూరు ప్రజల ఇలవేల్పు, శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారిని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. కందుకూరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారికి మొక్కుకున్నారు. దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు బాబు, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీను, అల్లం వెంకటేశ్వర్లు, మురారిశెట్టి శ్రీకాంత్, సుధీర్, చీదెళ్ల పిచ్చయ్య, సవిడిబోయిన వెంకటకృష్ణ, ముప్పవరపు వేణు, ముచ్చు వేణు, వలేటి వెంకటేశ్వర్లు, దివి శ్రీనివాసులు, ఘట్టమనేని సుబ్బారావు, చదలవాడ కొండయ్య, చుండూరి శ్రీను, నల్లూరి సూర్యనారాయణ, తలమంచి బ్రహ్మయ్య, తాతా లక్ష్మీనారాయణ, కంకణాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




OWNER, PUBLISHER AND EDITOR BY : CH.VASAVIDEVI, PRINTED AT : SANAM VENKATA RAJASEKAR ARUNODAYA NOTE BOOK MANUFACTURERS PVT LMT, 33-5-9, 3RD FLOOR, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA, KRISHNA , AP - 520002. PRGI NO. APTEL/2016/69464. CELL 9346935672.